WWW.TELUGUJYOTHIDAILY.COM
www.epaperteluguj yothidaily.com
PRGI NO TGTEL/25/A2223

# తెలుగు జ్యోతి

అనుక్షణం జనం కోసం
జాతీయ దినపత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 02 | సంచిక: 44 | ఎడిటర్ : దువ్వల శేఖర్ యాదవ్ | గురువారం 18 జూన్ 2026 | పేజీలు : 6 | వెల : 4-00

PUBLISHED FROM : HYDERABAD, CIRCULATED TO HYDERABAD, WARANGAL,NALGONDA, KHAMMAM,RANGAREDDY, KARIMNAGAR, AMARAVATI,KADAPA,SRIKAKULAM

## స్టాక్ మార్కెట్లు పతనం..

852 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్..

205 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ




# ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ వసతులు



- తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం తరగతి గదుల్లోనే ఉంది
- ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- ఇక్కడ మంచి నాయకత్వ లక్షణాలు ఉంటాయన్న రేవంత్
- ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్

ప్రభుత్వ విద్యావ్యవస్థను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేలా రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో ప్రభుత్వం నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' (టీపీఎస్) భవనాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా, సుమారు రూ. 15 కోట్ల భారీ వ్యయంతో ఈ విద్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఆరుట్లకు చేరుకున్న సీఎం, ముందుగా స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించి పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో - మిగతా3లో



## ఈ వ్యవస్థతో పిల్లల కలలు నాశనం

- పరీక్ష ఖర్చు విద్యా శాఖ బడ్జెట్‌తో సమానం
- భారత విద్యా విధానం పిల్లలపై ఒత్తిడిని పెంచి, వారిని మానసికంగా అణచివేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణ



రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో వారికే

## తొలి ప్రాధాన్యత

- హౌసింగ్ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి టెలీకాన్ఫరెన్స్
- గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యమని స్పష్టీకరణ
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో గుడిసెల్లో ఉన్న వారికి ప్రాధాన్యమిస్తామని వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారు

హైదరాబాద్

గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు సర్కారు ప్రత్యేక కార్యాచరణను చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలను గుర్తించేందుకు సమగ్ర సర్వే చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియపై - మిగతా3లో



## ప్రతిపక్ష నేతలను ఎన్‌డీఏలోకి లాగేందుకు ప్రయత్నాలు

- అమిత్ షాపై కాంగ్రెస్ విమర్శలు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు గుప్పించిన జైరాం రమేశ్
- ప్రతిపక్ష పార్టీలను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణ
- భారీ ప్రలోభాలతో ఎంపీలు, ఎమ్మెల్యేలను బీజేపీలోకి ఆకర్షిస్తున్నారన్న కాంగ్రెస్ నేత



## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ

- భారత్‌పై దాడి జరిగితే అమెరికా అండగా ఉంటుందని ట్రంప్ హామీ
- మోదీ ఉన్నంత వరకు మద్దతు ఉంటుందని స్పష్టీకరణ
- ఒకవేళ కొత్త నాయకుడు వస్తే చెప్పలేనని వ్యాఖ్య
- జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ, ట్రంప్ ద్వైపాక్షిక భేటీ



## కుటుంబానికి జీవనోపాధి

- హనుమకొండలో అభిమానిని పరామర్శించిన పవన్ కల్యాణ్
- చల్లగా ఉండాలంటూ ప్రేమతో డైరీలో నోట్
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న నిరంజన్
- బాలుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- అనంతరం భద్రకాళి అమ్మవారి ఆలయంలో బాబు పేరిట ప్రత్యేక పూజలు

# అభివృద్ధి పనుల్లో అవినీతి వరద

- లంచాలు ఆర్జించే అధికారులపై అవినీతి నిరోధక శాఖ కొరడా
- ప్రభుత్వ స్వేచ్ఛతో దూకుడు పెంచిన ఏసీబీ
- గడిచిన సంవత్సరాల్లో రికార్డు స్థాయిలో కేసులు నమోదు
- ముందు వరుసలో పోలీసు, రెవెన్యూ శాఖలు
- అభివృద్ధి పనుల పేరుతో అవినీతికి పాల్పడుతున్న అధికారులు

హైదరాబాద్

ప్రస్తుతం కొందరు అధికారులు చాప కింద నీరులా అవినీతికి పాల్పడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా లంచాలు తీసుకుంటూ అక్రమంగా ఆస్తులను పోగేసుకుంటున్నారు. ఇలాంటివి అధికమవుతుండటంతో అవినీతి నిరోధకశాఖ వీటిపై దృష్టిసారించింది. గడచిన 13 రోజుల్లోనే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు మూడు నమోదు చేసి అధికారుల చిట్టా బయటపెట్టింది. అక్రమార్కులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తుండటంతో అంతా అప్రమత్తమవుతున్నారు. నిదర్శనంగా పలు ఘటనలు అధికారిక లెక్కల ప్రకారం గడిచిన 13 రోజుల్లో ఏసీబీ - మిగతా3లో



## భారత్ ఆల్ టైమ్ రికార్డ్

- రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రూ. 1.78 లక్షల కోట్లు
- రాజ్‌నాథ్ సింగ్ కీలక ప్రకటన
- భారత రక్షణ రంగంలో మరో చారిత్రాత్మక విజయం
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆల్ టైమ్ హైకి రక్షణ రంగ ఉత్పత్తుల విలువ- ఏకంగా రూ. 1.78 లక్షల కోట్లుగా నమోదు

## దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ముప్పు..

- ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో వర్షాభావం
- ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 12 రాష్ట్రాలపై ఎల్ నినో ప్రభావం
- ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన కేంద్ర వ్యవసాయ మంత్రి
- ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచన



## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

- సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- సైబర్ నేరగాళ్లను సమాజానికి పరాన్నజీవులతో పోల్చిన సుప్రీంకోర్టు
- ఆన్‌లైన్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ
- అమాయక ప్రజల సొమ్మును కాజేస్తున్నారని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్య
- ఎఫ్ఐఆర్‌ల విలీనానికి హైకోర్టులను ఆశ్రయించాలని నిందితుడికి సూచన
- ఇలాంటి నేరస్థులను జైల్లో ఉంచడమే సమాజానికి శ్రేయస్కరం అని వ్యాఖ్య



# ఈ వ్యవస్థతో పిల్లల కలలు నాశనం

భారత విద్యా విధానం పిల్లలపై ఒత్తిడిని పెంచి, వారిని మానసికంగా అణచివేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ఈ వ్యవస్థ విద్యార్థులను ప్రధానంగా ఇంజనీరింగ్, వైద్యం, సివిల్ సర్వీసెస్ వంటి కొన్ని వృత్తి మార్గాల వైపు మాత్రమే మళ్లిస్తోందన్నారు. ఇతర రంగాల పట్ల ఆసక్తిని నిరుత్సాహపరుస్తోందని, పిల్లల కలలను నాశనం చేస్తుందని అన్నారు. కోచింగ్ కేంద్రాలకు ప్రసిద్ధి చెందిన రాజస్థాన్?లోని కోటాలో నిర్వహించిన 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గళం) మహా ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆయన పేపర్ లీక్‌లు, నిరుద్యోగం వంటి వివిధ అంశాలపై విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు.

"ఇది రాజకీయ సమావేశం కాదు. ఇది మీ గురించి, ఉజ్వల భవిష్యత్తు కోసం పోరాడుతున్న యువత కోసం జరుగుతున్న సమావేశం. మన దేశంలో పిల్లలను కేవలం ఐదు పనులు మాత్రమే ఎందుకు చేయమని అడుగుతున్నారు? దానికి సమాధానం 'డబ్బు'. ఎందుకంటే ఈ వ్యవస్థ ఆ ఐదు మార్గాల ద్వారానే డబ్బు సంపాదిస్తోంది. భారత విద్యా వ్యవస్థ ఒక దోపిడీ యంత్రం. యువత పెద్ద కలలు కనేలా ప్రోత్సహించే వ్యవస్థ మాకు కావాలి. దేశంలోని యువత తీవ్రమైన వేదన, ఒత్తిడి, అసంతృప్తికి గురవుతున్నారు. ఇది దేశానికి మంచిది కాదు." ఈ క్రమంలోనే చీజుజు, జీజుజు, ఖూాజ సివిల్ సర్వీసెస్ పరీక్ష, ూాజ, ==దీ వంటి పరీక్షలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తామన్న గ్యారెంటీ లేకపోయినా, లక్షలాది మంది విద్యార్థులు పాఠశాల విద్య, కోచింగ్ సంస్థలు, యూనిఫాంలు హాస్టల్ వసతుల



కోసం భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. చాలా తక్కువ సంఖ్యలో ఉండే పోస్టుల కోసం లక్షలాది మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని ఆయన అన్నారు. కేవలం చీజుజు పరీక్షకే దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరవుతుండగా, లక్ష కంటే తక్కువ మంది మాత్రమే ఎంపికవుతున్నారని, ఇది చాలా కఠినమైన పోటీ అని అన్నారు. ఇటువంటి విధానాలు విద్యా వ్యవస్థను అత్యంత కఠినంగా, చాలా మందికి అవకాశాలు దక్కకుండా చేసేలా మారుస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

విద్యా రంగ ఆర్థిక వ్యవస్థ ప్రతి ఏటా కుటుంబాల నుంచి భారీ మొత్తంలో డబ్బును వసూలు చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేవలం ఒక పరీక్ష కోసమే విద్యార్థులు, వారి కుటుంబాలు కలిసి ప్రభుత్వ మొత్తం విద్యా బడ్జెట్‌కు సమానమైన మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. చీజుజు పరీక్షకు 22 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వారు మొత్తం రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది విద్యా శాఖ బడ్జెట్ కేటాయింపులకు సమానమన్నారు.

"అనే ఐదు ప్రధాన పరీక్షలను విద్యార్థులు తమ కలలుగా భావిస్తారు. ఈ ఐదు పరీక్షల కోసం కుటుంబాలు కలిసి దాదాపు రూ. 3.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఈ మొత్తం విద్య, ఆరోగ్యం, కార్మిక, విజ్ఞాన శాస్త్రం, మహిళా–శిశు అభివృద్ధి వంటి మంత్రిత్వ శాఖలపై ప్రభుత్వం చేసే వ్యయంతో సమానం. ఇంత భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ, చాలా తక్కువ శాతం మంది విద్యార్థులు మాత్రమే స్థిరమైన ఉద్యోగాలను పొందుతున్నారు. మిగిలిన వారు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ప్రతి వెయ్యి మంది విద్యార్థుల్లో కొద్దిమందికి మాత్రమే జీతంతో కూడిన ఉద్యోగాలు లభిస్తున్నాయి. మిగిలిన వారు ఇబ్బందులు పడుతున్నారు."

ప్రతి 100 మంది ఇంజనీర్లలో దాదాపు 80 మంది నిరుద్యోగులుగా ఉన్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. యువత తమ జేబుల నుంచి లక్షలు, కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా, అత్యల్ప వ్యయంతోనే తమ కలలను సాకారం చేసుకునేలా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదుగురు విద్యార్థులతో రాహుల్? గాంధీ ముచ్చటించారు. చీజుజు, జీజుజు, సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారి కలలు, పరీక్షల సన్నద్ధత, వాటి కోసం వెచ్చించిన ఖర్చు, ఎంపిక అవకాశాల గురించి మాట్లాడారు.

# ప్రతిపక్ష నేతలను ఎన్‌డీఏలోకి లాగేందుకు ప్రయత్నాలు

కేంద్ర హోంమంత్రి అమిత్?షాపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమికి ప్రతీకారంగా ప్రతిపక్షాలపై దాడిచేయటంతోపాటు ప్రజాస్వామ్యాన్ని ఆయన ధ్వంసం చేస్తున్నారని ఆరోపించింది. రెండేళ్ల క్రితం బీజేపీ–వ్యతిరేక అజెండాతో ఎన్నికైన వారిని ప్రలోభాలకు గురిచేసి ఎన్?డీఏ వైపు ఆకర్షిస్తున్నారని విమర్శించింది. పార్టీ ఫిరాయించేవారికి ఇచ్చే ప్రోత్సాహకాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.

**'మ్యూచువల్ ఫండ్స్ తరహా రాజకీయ వ్యూహం'**

ప్రతిపక్ష నేతలను ఆకర్షించేందుకు అనుసరిస్తున్న వ్యూహాన్ని జైరాం రమేశ్ "మ్యూచువల్ ఫండ్స్"తో పోల్చారు. ఎవరిని పార్టీలోకి తీసుకురావాలనుకుంటే వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్యాకేజీలు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం సాగుతున్న చర్య అని విమర్శించారు. అమిత్ షా రాజకీయ వ్యూహాలకు హద్దులు లేవని, అయితే చివరికి ఆయన లక్ష్యం నెరవేరదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న ఊహాగానాలు, ఉద్ధవ్ వర్గం మరోసారి చీలనుందని వార్తలు వస్తోన్న నేపథ్యంలో జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**మహా రాజకీయాల్లో ఉత్కంఠ**

మహారాష్ట్రకు చెందిన ఎంపీలను కొనుగోలు చేసేందుకు రూ.15 కోట్ల అడ్వాన్స్ చెల్లిస్తున్నారనే సమాచారం తనకు అందిందని సంజయ్ రౌత్ ఆరోపించారు. ఈ వ్యవహారం షాకింగ్‌గా, అసహ్యకరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో శివసేన (యూబీటీ)కు చెందిన కొందరు లోక్‌సభ సభ్యులు అధికార శివసేనలో చేరే అవకాశాలపై ఊహాగానాలు కొనసాగుతున్నాయి. అధికార శివసేన నేత ప్రతాప్ సర్నాయక్ కూడా అసంతృప్త నేతలకు స్వాగతం పలుకుతామని సంకేతాలు ఇవ్వడంతో ఈ ప్రచారం మరింత బలపడింది.

**ఎంపీలకు విప్?**

ఇదిలా ఉండగా శివసేన (యూబీటీ) వర్గాలనికి చెందిన కొందరు లోక్‌సభ ఎంపీలు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి





అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు పార్టీ ఫిరాయింపు ప్రచారం మధ్యే శివసేన (యూబీటీ) వర్గం తమ ఎంపీలకు విప్ జారీచేసింది. ఢిల్లీలో జరిగే సమావేశానికి హాజరుకావాలని సూచించింది. కొందరు ఎంపీలు ఏక్‌నాథ్ శిందే వర్గంలో చేయనున్నారనే ప్రచారం మధ్య ఉద్ధవ్ వర్గం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశానికి హాజరుకాని ఎంపీలపై అనర్హత వేటువేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన 9మంది లోక్‌సభ ఎంపీల్లో ఆరేడు మంది ఎంపీలు పార్టీ మారనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. 2022లో ఏక్‌నాథ్ శిందే నాయకత్వంలోని 39మంది ఎమ్మెల్యేలు, కొందరు ఎంపీలు తిరుగుబాటు చేశారు.

దీంతో ప్రస్తుతం శివసేన (యూబీటీ) ఎంపీలు నిజంగానే శిందే వర్గంలో చేరతారా? లేక ఇది కేవలం రాజకీయంగా ఒత్తిడి సృష్టించే ప్రయత్నమేనా? అన్నది ఢిల్లీలో జరగనున్న సమావేశాల తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవైపు ఎంపీల ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడం, కీలక నేతలు ఢిల్లీలో మకాం వేయడం, వరుస భేటీలు మహారాష్ట్ర రాజకీయాల్లో మరో పెద్ద ట్విస్ట్‌కు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఎంపీలు నిజంగానే పార్టీ మారితే ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి మరో పెద్ద ఎదురుదెబ్బ తగలనుంది.

**తృణమూల్ కాంగ్రెస్‌లో తిరుగుబాటు**

మరోవైపు టీఎంసీలో కూడా రాజకీయ సంక్షోభం నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది ఎంపీలు ఇటీవల లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి, తాము నేషనల్ సిటిజన్స్? పార్టీ ఆఫ్? ఇండియాలో విలీనమవుతున్నట్లు ప్రకటించారు. తిరుగుబాటు వర్గానికి చెందిన ఎంపీ అరూప్ చక్రవర్తి మాట్లాడుతూ, పార్టీని సరిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. పార్టీ ఎన్నికల గుర్తుపై కూడా తమ హక్కును చాటుకుంటామని పేర్కొన్నారు. అయితే మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఈ చర్యను పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి విరుద్ధమని అభివర్ణించింది.

# భారత్ ఆల్ టైమ్ రికార్డ్

భారత రక్షణ రంగం స్వయం సమృద్ధి దిశగా జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఆత్మ నిర్భర్ భారత్ పిలుపుతో దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ సరికొత్త మైలురాయిని అధిగమించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ రంగ ఉత్పత్తుల విలువ ఏకంగా రూ. 1.78 లక్షల కోట్లకు చేరుకుంది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం. అంటే ఆల్ టైమ్ రికార్డుగా చెప్పొచ్చు. ఈ విషయాన్ని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం అధికారికంగా వెల్లడించారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 15.6 శాతం ఎక్కువ. 2020–21 ఆర్థిక సంవత్సరంతో చూస్తే అంటే ఐదేళ్లలో రికార్డు స్థాయిలో 110 శాతం వృద్ధి నమోదు చేసింది. రక్షణ మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం దేశీయంగా తయారీ ఒకప్పటితో పోలిస్తే విపరీతంగా పెరగడం, ప్రైవేట్ రంగం భాగస్వామ్యం మరింత విస్తరించడం, రక్షణ ఎగుమతులు గణనీయంగా పెరగడం ఈ భారీ వృద్ధికి దోహదపడింది. ఇవే ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. భారత రక్షణ రంగం సాధించిన ఘనతపై మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత రక్షణ ఉత్పత్తి ప్రతి ఏటా సరికొత్త శిఖరాల్ని అధిరోహిస్తుందని వ్యాఖ్యానించారు. '2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ ఉత్పత్తి రూ. 1.78 లక్షల కోట్లకు చేరడం దేశ రక్షణ రంగ బలానికి నిదర్శనం.' అని సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిరంతర విధానపరమైన మద్దతు, కొత్త ఆవిష్కరణలతో రానున్న రోజుల్లో రక్షణ రంగం మరింత వేగంగా దూసుకెళ్తుందని



ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈసారి రక్షణ ఉత్పత్తిలో ప్రైవేట్ కంపెనీల పాత్ర మరింత పెరిగింది. మొత్తం రక్షణ రంగం ఉత్పత్తుల్లో 76 శాతం ప్రభుత్వ రంగ సంస్థల వాటానే. 24 శాతం వాటా ప్రైవేట్ రంగ కంపెనీలది. ఇక ఇందులో ప్రైవేట్ రంగ ఉత్పత్తి విలువ సుమారు రూ. 42 వేల కోట్లుగా ఉంది. గతేడాది 22 శాతంగా ఉన్న ఈ వాటా ఈసారి 24 శాతానికి చేరింది. దీంతో భారత రక్షణ రంగంలో ప్రైవేట్ కంపెనీల ప్రాధాన్యం పెరుగుతున్నట్లు సూచిస్తోంది.

**రికార్డు స్థాయికి రక్షణ ఎగుమతులు**

భారత్ 2025–26 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తితో పాటు ఎగుమతుల్లోనూ సరికొత్త చరిత్ర సృష్టించింది. గత ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఎగుమతులు రూ. 38,424 కోట్లకు చేరి జీవన కాల గరిష్ఠాల్ని నమోదు చేశాయి. భారతదేశంలో తయారైన ఆయుధాలు, రక్షణ పరికరాలు, సాంకేతికతపై విదేశాల నమ్మకం పెరుగుతుందనేందుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

గత కొన్నేళ్లలో చూస్తే 2013–14 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 43,746 కోట్లుగా ఉండగా అక్కడి నుంచి ప్రస్తుతం 4 రెట్లు పెరిగింది. 2020–21 లో రూ. 84,643 కోట్లుగా ఉండగా.. అక్కడితో డబుల్ అయింది. 2024–25 లో రూ. 1.54 లక్షల కోట్లు, 2025–26 లో రూ. 1.78 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది రక్షణ రంగం ఎదుగుదలను సూచిస్తోంది. భారత రక్షణ ఉత్పత్తి పెరగడం వల్ల విదేశీ ఆయుధాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. దేశీయ భద్రత మరింత బలోపేతం అవుతుంది. దేశీయంగా పరిశ్రమలకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఎగుమతులు పెరగడం వల్ల విదేశీ మారక ద్రవ్యం లభిస్తుంది. అత్యాధునిక సైనిక సాంకేతికత మన దేశంలోనే అభివృద్ధి చెందుతుంది.

## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ



భారత్‌పై దాడి జరిగితే అమెరికా సైనిక సహకారం అందిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హామీ ఇచ్చారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అధికారికంగా ఎలాంటి రక్షణ ఒప్పందం లేనప్పటికీ, ట్రంప్ బహిరంగంగా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఇరు దేశాల రక్షణ సంబంధాలపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. "మా మధ్య అధికారిక ఒప్పందాలేవీ లేవు. అయినప్పటికీ, భారత్‌పై దాడి జరిగితే మేము అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. అనంతరం ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ, "ఆయనపై ఎవరైనా దాడి చేస్తే మేము అండగా ఉంటాం. ఒకవేళ కొత్త నాయకుడు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలియదు కానీ, మోదీ నాయకత్వంలో భారత్‌కు మా పూర్తి సహకారం ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. ఉభయ దేశాల మధ్య సంబంధాలు అసాధారణ స్థాయిలో బలపడ్డాయని ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఒప్పందం కుదరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ "చర్చల విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. అత్యంత కఠినంగా వ్యవహరించే నాయకుల్లో ఆయన ఒకరు" అని కొనియాడారు. ఈ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత ఏడాది వాషింగ్టన్‌లో జరిగిన సమావేశం తర్వాత ఇరు దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం వైట్‌హౌస్‌లో భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రుడు ఉంటాడని ఈ సందర్భంగా ట్రంప్ భరోసా ఇచ్చారు.

## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల సంపదను దోచుకునే 'పరాన్నజీవులు' అని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు బుధవారం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక సైబర్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విచారించాలని కోరుతూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది. "మీలాంటి వారు పరాన్నజీవులు. అమాయక మదుపరుల నుంచి సొమ్ము వసూలు చేసి వారిని వంచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో మేము అత్యంత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది" అని విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ తరహా నేరగాళ్లు తమిళనాడు నుంచి జమ్మూకశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధర్మాసనం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరస్థులను జైల్లోనే ఉంచడం సామాజిక ప్రయోజనాలకు శ్రేయస్కరమని ధర్మాసనం పేర్కొంది. దేశంలో "డిజిటల్ అరెస్ట్" వంటి స్కామ్‌లతో సహా ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ మోసాల ధాటికి వృద్ధులు, సామాన్యులు కోట్ల రూపాయలు మేర నష్టపోతున్నారని, అటువంటి వారిని కట్టడి చేసేందుకు కఠినమైన న్యాయపరమైన వైఖరి అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

## దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ముప్పు..

రైతులకు, వ్యవసాయ రంగానికి ఆందోళన కలిగించే ఒక కీలక అప్‌డేట్ వాతావరణ శాఖ నుండి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దేశంలోని దాదాపు 12 రాష్ట్రాలపై 'ఎల్ నినో' తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమైంది. ఖరీఫ్ 2026 సన్నద్ధతపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని కీలక వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలపై ప్రభావం ఉంటుందని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శివరాజ్ సింగ్ చౌహాన్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు తగ్గితే రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో ఉన్న జిల్లా అధికారులు, రాష్ట్రాల వ్యవసాయ విభాగాలు, కృషి విజ్ఞాన్ కేంద్రాలు, ఇతర అనుబంధ సంస్థలతో తక్షణమే సమన్వయ సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కరువు లాంటి పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

## ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గ్రీన్ గోల్ఫ్ కోర్స్‌కు టూరిస్టుల ఫిదా! బ్రిటిష్ కాలంలోనే నిర్మాణం

చుట్టూ ఆకాశాన్ని తాకే హిమాలయ పర్వతాలు, మధ్యలో పచ్చని మైదానంలో ప్రకృతి సోయగాల మధ్య గోల్ఫ్ ఆట. ఇది వింటుంటేనే ఎంతో ఆహ్లాదంగా ఉంది కదూ. అలాంటి ప్రదేశం నిజంగా ఉందా? అనే సందేహం కూడా మొదలవుతుంది. కానీ అది నిజంగానే ఉంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గ్రీన్ గోల్ఫ్ కోర్సుల్లో ఒకటిగా పేరొందిన గుల్మార్గ్ గోల్ఫ్ కోర్స్ ప్రస్తుతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ గోల్ఫ్ కోర్స్ వేసవిలో పచ్చదనంతో కళకళలాడుతుండగా, శీతాకాలంలో దట్టమైన మంచు దుప్పటి కప్పుకుని మరో అందాన్ని సంతరించుకుంటుంది. అరుదైన పూలతో ఉండే ఈ ప్రకృతి రమణీయ ప్రదేశాన్ని చూసేందుకు దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యటకులు తరలివస్తున్నారు. కశ్మీర్?లోని గుల్మార్గ్‌లో సముద్ర మట్టానికి సుమారు 2,650 మీటర్ల (8,694 అడుగులు) ఎత్తులో ఉన్న ఈ గోల్ఫ్ కోర్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. పచ్చని మైదానాలు, చుట్టూ మంచు పర్వతాల నడుమ విస్తరించిన ఈ కోర్స్, గోల్ఫ్ క్రీడాకారులను మాత్రమే కాకుండా సాధారణ పర్యటకులను కూడా విశేషంగా ఆకర్షిస్తోంది. 18 హోల్స్‌తో రూపొందించిన ఈ గోల్ఫ్ కోర్స్ భారతదేశంలోనే అత్యంత పొడవైన గోల్ఫ్ కోర్స్‌గా పేరుగాంచింది. ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఈ గోల్ఫ్ కోర్స్ సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. వేసవి, వర్షాకాలాల్లో పచ్చదనంతో మెరిసిపోతూ గోల్ఫ్ ప్రేమికులకు అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో వివిధ రకాల అడవి పూలు వికసించి ఈ ప్రాంత సౌందర్యాన్ని మరింత రెట్టింపు చేస్తాయి. శీతాకాలంలో భారీగా మంచు కురవడంతో గోల్ఫ్ కోర్స్ పూర్తిగా మంచుతో కప్పుకుపోతుంది. ఆ సమయంలో ఈ ప్రాంతాన్ని స్కీయింగ్, ఇతర శీతాకాల క్రీడల కోసం వినియోగిస్తారు. దీంతో ఏడాది పొడవునా గుల్మార్గ్ పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గుల్మార్గ్ గోల్ఫ్ కోర్స్‌కు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. బ్రిటిష్ పాలన కాలంలో 1911లో దీనిని నిర్మించారు. అనంతరం 1922లో ఇక్కడ తొలి గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. అప్పటి నుంచి ఇది అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షిస్తోంది. ప్రస్తుతం అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో పర్యాటకులు గుల్మార్గ్‌కు చేరుకుంటున్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు గోల్ఫ్ ఆడుతూ తమ సెలవులను ఆనందంగా గడుపుతున్నారు.

# ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ వసతులు

-మొదటిపేజీ తరువాయి

కార్పొరేట్ వసతులు కల్పించే దిశగా తమ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యపై తల్లిదండ్రులకు పలు అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణం చేపట్టినట్లు సీఎం తెలిపారు. విద్యాశాఖపై తమ ప్రభుత్వం 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నదని, గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నీరుగార్చిందని ఆరోపించారు.

ముఖ్యమంత్రి పాఠశాలలోని తరగతి గదులను నిశితంగా పరిశీలిస్తూ క్యాంపస్ అంతా కలియతిరిగారు. ఈ సందర్భంగా అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించిన రేవంత్ రెడ్డి, తరువాత వారితో కలిసి కూర్చుని ఎంతో ఉత్సాహంగా అల్పాహారం తీసుకున్నారు. స్కూల్‌లోని అత్యాధునిక వంటగదిని పరిశీలించారు. వంట చేస్తున్న మహిళా సిబ్బందితో కలిసి సరదాగా ముచ్చటిస్తూ, స్వయంగా చపాతీలు (పూరీలు) ఒత్తి వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం అక్కడ ఉన్న వారందరితో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు.

ఈ అంతర్జాతీయ స్థాయి మోడల్ పాఠశాలలో కల్పించిన అద్భుతమైన మౌలిక వసతుల గురించి విద్యా కమిషన్ మాజీ ఛైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ముఖ్యమంత్రికి క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ క్యాంపస్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయం (లైబ్రరీ), హైటెక్ కిచెన్, విశాలమైన డైనింగ్ హాల్‌తో పాటు ఆటల కోసం పెద్ద క్రీడా మైదానాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ఆయన పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే తనపై కొంత మంది విమర్శలు చేశారని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామన్న ఆయన మెస్సీ డ్రగ్స్ ముఠా లీడర్ కాదు, ఆర్థిక నేరగాడు కాదని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే నెల రోజులకే చిరిగేవన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని తెలిపారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్ల టెండర్లతో పిలిస్తే అందులో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని మాజీ మంత్రి హరీశ్?రావు అంటున్నారని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2 వేల కోట్ల స్కామ్ ఎలా సాధ్యమో చెప్పాలని అన్నారు. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతామని పునరుద్ఘాటించారు.



### వంటగదిలో పూరి చేసిన సీఎం

టీపీఎస్‌ను ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణంలో మొత్తం కలియతిరిగారు. ముందుగా కిచెన్‌లోకి వెళ్లారు. అక్కడి సిబ్బందితో కలిసి పూరీ చేశారు. అనంతరం అందరితో కలిసి ఫోటో దిగారు. తరగతి గదులను నిశితంగా పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఐఏఎస్? ఆకునూరి మురళి తెలంగాణ పబ్లిక్ స్కూల్?కు సంబంధించిన అన్ని వివరాలను క్షుణ్ణంగా తెలిపారు. టీపీఎస్?ను కార్పొరేట్ స్కూల్ స్థాయిలో రూ.15 కోట్లతో ప్రభుత్వం నిర్మించింది. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్, క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్? బాబు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్? రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, ప్రభుత్వ సలహదారు కేశవరావు, విద్యా కమిషన్ మాజీ ఛైర్మన్ ఆకునూరి మురళి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఇతరులు పాల్గొన్నారు.

కొత్త తరానికి సరికొత్త అవకాశాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడూ చెప్తుంటారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యకు పెద్దపీట వేసి, ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దాలని చెప్తుంటారని, భావితరాల కోసం ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణం చేపట్టామన్న ఆయన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తామన్నారు. అత్యుత్తమ విద్య, వైద్యం నినాదంతో సీఎం ముందుకెళు న్నారని పేర్కొన్నారు.

ఈ వేడుకలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డిలు పాల్గొన్నారు. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పలువురు ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కుటుంబానికి జీవనోపాధి

హనుమకొండలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటించారు. హనుమకొండ హనుమాన్‌నగర్‌లోని జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ (17) అనే అభిమాని ఇంటికెళ్లి పవన్ పరామర్శించారు. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన నిరంజన్‌ను ఆప్యాయంగా పలకరించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్-మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ క్రమంలో వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? నిరంజన్?ను కాపాడుకోవడానికి ఏం ఏం అవకాశాలు ఉన్నాయన్న విషయంపై ఆరా తీశారు. భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఎల్లప్పుడు ఉంటాయని కుటుంబ సభ్యుల్లో మనో ధైర్యం నింపారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాలుడికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు.

### వెంకటేశ్వరస్వామి తీర్థ ప్రసాదాలు

తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు పవన్‌కల్యాణ్ కప్పారు. దేవుడి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అలాగే నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్‌కల్యాణ్‌ను అనుకరిస్తూ వేసిన డ్యాన్సు వీడియోలను చూశారు. భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిరంజన్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు చేయిస్తానని తెలిపారు. అలాగే భద్రకాళి అమ్మవారి ప్రతిమతో పూజలు జరిపి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు.

### బాలుడికి ప్రేమతో పవన్ లేఖ

బాలుడిని పరామర్శించిన పవన్? అతనికి చిరకాలం గుర్తుండిపోయేలా ఓ నోట్ రాశారు. "ప్రియమైన నిరంజన్‌కు ప్రేమతో.. దుర్గామాత ఆశీస్సులతో చల్లగా ఉండాలని కోరుకుంటున్నా" అని డైరీలో పవన్ కల్యాణ్ రాసి ఇచ్చారు.

తల్లిదండ్రుల జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ తండ్రి గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవారని చెప్పారు. అలా వారి జీవనోపాధి మరింత మెరుగుపర్చేందుకు క్యాంటిన్? పెట్టించాలని తెలంగాణ జనసేన నాయకులకి పవన్ తెలియజేస్తానన్నారు. అలాగే బాలుడిని పరామర్శిస్తున్న క్రమంలో అతను పవన్‌కల్యాణ్‌కు కుక్కపిల్ల బొమ్మను చూపి పెంచుకోవాలనిపిస్తుందని తెలిపారు. దీంతో కుక్కపిల్లను కొని పంపుతానని హామీ



ఇచ్చారు. దానిని పెంచుకోవడానికి స్వయంగా ఆ ఇంటి యజమానితో మాట్లాడి అనుమతి ఇప్పించారు.

కాగా బాలుడి పరామర్శ అనంతరం భద్రకాళి అమ్మవారిని పవన్?కల్యాణ్? దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో అర్చకులు పవన్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పవన్? కల్యాణ్ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండలో పవన్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. పవన్‌కల్యాణ్ బాబుని పరామర్శిచడంపై రాంగోపాల్,మానస సంతోషం వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. "బాబుకి కిడ్నీ సమస్య ఉంది. ఎడమవైపు కిడ్నీ ఒకటి చిన్నగా ఉంది, కుడివైపుది పెద్దగా ఉంది. పవన్‌కల్యాణ్ మ్యూజిక్ వచ్చిందంటే బాబుకు కాళ్లు, చేతులు ఆగకపోయేది. మంచిగా డ్యాన్స్ చేసేవాడు. నాలుగు నెలల నుంచి ఏం అయ్యిందో గాని మొత్తం బెడ్‌కే అంకితం అయిపోయాడు. బాబుకు పవన్‌కల్యాణ్ అంటే చాలా ఇష్టం. ఇక్కడ బాబుని చోటా గబ్బర్‌సింగ్ అని చాలా మంది పిలిచేవారు"

### తెలంగాణ సీఎంకు పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు

"ఈ రోజు నా వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ పోలీసు శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను" పవన్?కల్యాణ్? ఎక్స్? వేదికగా రాసుకొచ్చారు.

# ప్రభుత్వ బడిలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో కూడిన విద్య

రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్(టీపీఎస్)ను తీర్చిదిద్దింది. ఈ సంవత్సరం ప్రారంభించనున్న వంద పాఠశాలలకు ఇదీ రోల్‌మోడల్. సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కలలకు ప్రతిరూపం. ప్రభుత్వం గతంలో ఆదర్శ పాఠశాలలు, గురుకులాలను అనేకం ప్రారంభించింది. అయితే ఈ పాఠశాలలకు టీపీఎస్?? భిన్నంగా ఉండటంతో ప్రజలందరి మన్ననలను అందుకుంటోంది. 30 మంది సభ్యులు ఉండే తల్లిదండ్రుల కమిటీని రూ.15 కోట్ల వ్యయంతో తీర్చిదిద్దిన తీరు అపూర్వం. ఈ పాఠశాలను సీఎం రేవంత్‌రెడ్డి నేడు అధికారికంగా ప్రారంభించారు. నేడు నాణ్యమైన విద్య పేదలకు అందని ద్రాక్షలా మారింది. ఈ నేపథ్యంలో నిరుపేద విద్యార్థులకు టీపీఎస్? ఆశాకిరణంలా మారింది. ఈ పాఠశాల పేద, మధ్య తరగతి వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తోంది. నాడు చాలీచాలని ఫర్నీచర్? - శిథిలమైన గదులు : ఒకప్పుడు ఆరుట్లలో ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, మరో ఆదర్శ పాఠశాల ఉండేవి. చాలీచాలని ఫర్నీచర్?, శిథిలమైన గదులు, బోధనోపకరణాల కొరత, అంతంత మాత్రం చదువులు ఇదీ మొన్నటి వరకు ఇక్కడి పాఠశాలల పరిస్థితి. విద్యార్థుల కొరతతో బాలికల పాఠశాల మూతపడింది. అయితే మిగిలిన పాఠశాలల్లో సుమారు 600 మంది విద్యార్థులు ఉండేవారు. నేడు ల్యాబ్‌లు - డిజిటల్ బోధన : అయితే తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలెట్ ప్రాజెక్టును అమలు చేయడానికి తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ఆరుట్ల పాఠశాలను ఎన్నుకున్నారు. ఈ ప్రాంగణంలోని అన్ని పాఠశాలలను ఒకే గొడుగు కిందికి చేర్చారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం మొదలుపెట్టారు. గత సంవత్సరం జూన్ 12న పాఠశాల పునఃప్రారంభమయ్యాక టీపీఎస్ ప్రవేశాల కొరకు దరఖాస్తులు తీసుకున్నారు. కాగా దీనికోసం 2 వేల దరఖాస్తులు వచ్చాయి. అయితే అడ్మిషన్లను 1600కు పరిమితం చేశారు. కొత్తగా వచ్చిన వారిలో 72 శాతం మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చిన వారే ఉన్నారు. పాఠశాలలో ల్యాబ్‌లు, డిజిటల్ బోధన, ఆటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇబ్రహీంపట్నం టౌన్ సహా మండలంలోని ఇతర గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థుల ఉన్నారు. ఈ నేపథ్యంలో వీరంతా రాకపోకలు సాగించేందుకు ఐదు బస్సులను ఏర్పాటు చేశారు. దీనికోసం విద్యార్థుల నుంచి నామమాత్రంగా రవాణా ఫీజు వసూలు చేస్తున్నారు. పాఠశాలలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా పేరెంట్స్ కమిటీ ఆమోదించాల్సి ఉంటుంది. దీనికోసం 30 మందితో కమిటీ ఏర్పాటు చేసి ప్రతి శనివారం సమావేశం ఏర్పాటు చేయనున్నారు. కమిటీ పర్యవేక్షణలో అన్ని పనులూ చేపడతారు. పాఠశాలలో ఖర్చు చేసే ప్రతి రూపాయికీ జవాబుదారీతనం ఉంటుంది. ఇక్కడ వసతుల కోసం ప్రభుత్వం రూ.12 కోట్లు కేటాయించగా సోషల్ డెమోక్రటిక్ ఫోరం (ఎస్‌డీఎఫ్) రూ.3 కోట్లు విరాళంగా ఇచ్చింది.

## రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో వారికే తొలి ప్రాధాన్యత

-మొదటిపేజీ తరువాయి

అధికారులతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని క్షేత్రస్థాయిలో ఆ వివరాలు పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు కూడా స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హులను గుర్తించాలని మంత్రి పొంగులేటి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న పేదలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గానికి రెండు వేల చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేసినందువల్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 500 చొప్పున తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు రేకులు, టార్పాలిన్ షీట్లు, నాపరాళ్లతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ఇళ్లను గుర్తించి స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఇళ్ల పథకంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన పలు కీలక సూచనలు చేశారు.

### అసంపూర్తి ఇళ్లను మరోసారి పరిశీలించండి

ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పాత ఇందిరమ్మ పథకం కింద మంజూరై బేస్‌మెంట్ లేదా పైకప్పు స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చవచ్చని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం కింద నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయిన గృహాలను కూడా గుర్తించి రూఫ్ అప్‌గ్రేడేషన్ కార్యక్రమం ద్వారా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఎల్‌సీ విధానంలో లబ్ధిదారుడే తన ఇంటిని నిర్మించుకొనే అవకాశం కల్పించామని పొంగులేటి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరతను దృష్టిలో పెట్టుకొని చిన్న స్థలాలున్న లబ్ధిదారులకు అవసరం మేరకు జీ ప్లస్ వన్ నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వవచ్చునన్నారు.

### అలా నిర్మిస్తే బిల్లులు మంజూరు కావు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించేందుకు పంచాయతీ సెక్రటరీలు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించిన ఫొటోలను తీసి యాప్‌లో అప్?లోడ్? చేస్తారు. అయితే ఆ ఫొటోలను పరిశీలించే బాధ్యతలను ప్రభుత్వం ఈసారి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?)కి అప్పగిస్తోంది. ఈ ఫొటోలను ఏఐ స్కాన్ చేస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి ప్రకారం నిర్మాణాలు చేపట్టిన వారిని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లను ఇది సులభంగానే గుర్తిస్తోంది. ఇలాంటి నిర్మాణాలను 'అనర్హమైనవి'గా ఏఐ తేల్చేస్తోంది. మానవ ప్రమేయం లేకపోవటంతో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకూ లోనుకాకుండా ఇలాంటి అక్రమాలకు సులువుగా అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఏర్పడుతోంది. ఇదే తరహాలో ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలకు పాల్పడిన కొంతమంది హౌసింగ్ ఏఈలను గతంలో విధుల్లో నుంచి తొలగించిన సందర్భాలూ ఉన్నాయి.

## అభివృద్ధి పనుల్లో అవినీతి వరద

-మొదటిపేజీ తరువాయి

రూ.36.9 కోట్ల అక్రమార్జనను గుర్తించింది. లంచాలు తీసుకొని దొరికిన వారిలో, ఎవరి ఆస్తిని లెక్కించినా మార్కెట్ విలువ ప్రకారం రూ.100 కోట్లకు పైనే ఉంటుందని తేలింది. కాళేశ్వరం మాజీ ఈఎన్సీలు మురళీధర్‌రావు, భూక్యా హరిరామ్, ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్ నుంచి ఇటీవల అనిశాకు చిక్కిన, హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డు జనరల్ మేనేజర్ అనంత లక్ష్మీకుమార్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మద్రి వంశీమోహన్, ఈ నెలలో దొరికిన భుజంగరావు, మోహన్ నాయక్, నరహరిరావుల ఉదంతాలే ఇందుకు నిదర్శనం.

### లంచాల్లో మొదటి స్థానంలో పోలీసులే

లంచాలు తీసుకొని ఏసీబీకి చిక్కుతున్న వారిని గమనిస్తే అధికంగా ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలు ఉన్న అధికారులే అధికంగా ఉన్నారని తెలుస్తోంది. వీరంతా ప్రజలను లంచాలు ఇవ్వాలని పీడిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ సంవత్సరం ఏసీబీ చేసిన రైడ్లలో పోలీసు అధికారులే ఎక్కువగా ఉన్నారు. అన్యాయం జరిగిందని పోలీసుల దగ్గరకు వెళ్తే, అమాయకుల దగ్గర నుంచే పైసలు లాగుతున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్? 16 వరకు ఏకంగా 14 కేసులు పోలీసులపైనే నమోదు అయ్యాయి.

### తర్వాత స్థానంలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్

పోలీసుల తర్వాత అధికంగా లంచాలకు పాల్పడుతున్నది రెవెన్యూశాఖ. ప్రతి కుటుంబానికి నిత్య జీవితంలో రెవెన్యూ శాఖతో సంబంధం ఉంటుంది. దీనివల్ల ప్రతి ఒక్కరి దగ్గర ఎంతో కొంత లంచాలు తీసుకొనేందుకే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఇక నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పంచాయతీ వ్యవహారాలను చూసేందుకు చాలా వరకు ప్రజలను లంచం అడుగుతున్నారు. ఈ విధంగా ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని దొరికిన కాడికి దోచుకుంటున్నారు. ఇదంతా అవినీతికి పరాకాష్ఠగా మారింది.

అక్రమార్జనలో అధికంగా లాగుతుంది మాత్రం అభివృద్ధి పనులు చేయిస్తున్న అధికారులనే తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వాలు రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నాయి. ఈ బాధ్యతలు తీసుకున్న అధికారులు అక్రమంగా లబ్ధి పొందుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం నీటిపారుదలశాఖ చేసిన విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు వద్ద రూ.9.42 కోట్లు గుర్తించగా, ఈఈగా పనిచేసిన నూనె శ్రీధర్ వద్ద రూ.7 కోట్లు, కాళేశ్వరం ఈఎన్సీగా పనిచేసిన భూక్యా హరిరామ్ వద్ద రూ.5.26 కోట్ల అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు.

### రవాణాశాఖలోనూ అధికంగా అక్రమార్జన

రోడ్లు, భవనాల అభివృద్ధి అంటూ అధికారులు అందినకాడికి దోచుకుంటున్నారు. వీటికి సంబంధించిన ఉదంతాలు ఇటీవలి కాలంలో ఎన్నో బయటపడ్డాయి. మహబూబ్?నగర్? రవాణాశాఖ ఉప కమిషనర్? కిషన్? రూ. 12.72 కోట్లు కూడబెట్టినట్లు బయటపడింది. ఈ నెలలో అదనపు ఎస్పీ (సస్పెన్షన్) భుజంగరావు రూ.5.92 కోట్లు, రోడ్లు, భవనాల శాఖ ఈఎన్సీ మోహన్‌నాయక్ రూ.17.94 కోట్ల అక్రమార్జన వెలుగులోకి వచ్చింది. తాజాగా మంగళవారం చిక్కిన ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్ డీడీ సుంకరి నరహరిరావు అక్రమార్జన రూ.13.05 కోట్లుగా తేల్చారు. ఈ ముగ్గురి ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో కనీసం రూ.500 కోట్లు ఉంటుంది.

### దూకుడు పెంచిన ఏసీబీ

ఇలాంటి ఘటనలు అధికమవుతుండటంతో ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. దీంతో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ క్రమంలో అక్రమార్కుల చిట్టా ఒక్కొక్కటిగా బయటకు వస్తోంది. 2020లో ఈ కేసులు కేవలం 94 నమోదయ్యాయి. గత ఏడాది ఈ సంఖ్య 199కి చేరింది. అంటే ప్రతి రెండు రోజులకు ఒక కేసు చొప్పున వెలుగులోకి వస్తున్నాయి. అయినప్పటికీ కొంతమంది అధికారులు భయం లేకుండా యూపీఐ ద్వారా లంచాలకు పాల్పడుతున్నారు. వరంగల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినప్పుడు అక్కడున్న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లకు ఏజెంట్లు ఏడాది కాలంలో రూ.42,03,125 చెల్లించినట్లు గుర్తించారు.

### 2025, 2026లో గుర్తించిన మొత్తం ఆస్తులు

జూన్ 16 వరకు శాఖల వారిగా పోలీసు డిపార్ట్?మెంట్?లో 14 కేసులు, రెవెన్యూలో 13, మున్సిపల్ శాఖలో 8, పంచాయతీరాజ్?లో 8, విద్యాశాఖలో 6 కేసులు నమోదు అయ్యాయి. 2026 లో ఇలా రూ.36,92,84,217 విలువైన ఆస్తులు గుర్తించింది. అధికారిక విలువ ఇంతకు పదిరెట్లకు పైమాటే. 2025లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ రూ.96,13,50,554 విలువైన ఆస్తుల్ని గుర్తించింది. అనధికారికంగా వీటి విలువ కనీసం రూ.వెయ్యి కోట్లు ఉంటుంది.

# సిద్ధాపూర్‌కు డంపింగ్ యార్డ్ రానివ్వం





**: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**జేపీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న కాంగ్రెస్ నేతలు**

తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 17

కొత్తూరు మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామానికి ఎట్టి పరిస్థితుల్లోనూ డంపింగ్ యార్డ్ రానివ్వబోమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొత్తూరు మండలంలోని ప్రముఖ జేపీ దర్గాలో కాంగ్రెస్ నాయకుడు మసూద్ హైమద్ ఏర్పాటు చేసిన నియాజ్ కార్యక్రమానికి హాజరైన ఆయన, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన జేపీ దర్గా ఉన్న ప్రాంతంలో అలాంటి ప్రతిపాదనకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. అనవసర రాజకీయ విమర్శలతో ప్రజలను భయాందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాల వల్లే వివాదం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాల ఫలితమేనని ఆరోపించారు. రైతుల నుంచి సేకరించిన భూములను టీజీఐఐసీకి అప్పగించే సమయంలో వాటిని 'జనరల్ పర్పస్' కేటగిరీలో నమోదు చేయడం వల్లే ఈ ప్రతిపాదన వెలుగులోకి వచ్చిందన్నారు. ఇప్పుడు అదే పార్టీ నాయకులు ఈ అంశంపై రాజకీయాలు చేయడం ఆశ్చర్యకరమని విమర్శించారు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని, ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయం తీసుకోబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుసేని, కొత్తూరు ఉమ్మడి మండలం మాజీ ఎంపీపీ ఎం. శివశంకర్ గౌడ్, కొత్తూరు మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, కొత్తూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జే సుదర్శన్ గౌడ్, నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ స్వామి గౌడ్, సర్పంచుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ, గ్రామ సర్పంచులు గోపాల్ నాయక్, ఎర్రోళ్ల జగన్, మంకాల శ్రీశైలం, గొర్ల పల్లి అశోక్, బుగ్గ సాలయ్య, గోవింద్ నాయక్, బాసు నాయక్, దయానంద్ గుప్తా, శ్రీరామ్ యాదవ్, నందిగామ మండలం ఉప సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ఆవుల మంద శివశంకర్, ఉప సర్పంచ్ సిరాజ్, కాంగ్రెస్ నాయకులు, పసుల బుచ్చయ్య, అన్నారం నరసింహ గౌడ్, మెడికల్ షాప్ రవి, తేజేశ్వర్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజె అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా జన్మదిన వేడుకలు.




తెలుగుజ్యోతి, రంగారెడ్డి జూన్ 17:

రంగారెడ్డి జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు ఎండీ సలీం పాషా జన్మదినం పురస్కరించుకొని జర్నలిస్ట్ లు నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఈకార్యక్రమంలో మాజీ రంగారెడ్డి జిల్లా ఎంపీటీసీ ఫోరమ్ మాజీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి,రంగారెడ్డి ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు ప్రసాద్,శేరిలింగంపల్లి సీనియర్ జర్నలిస్ట్ కబీర్,వరుణ్,నర్సింహా,ఖాజా, యాసీన్, రాఘవేందర్ శంకర్ పల్లి ప్రెస్ క్లబ్ కార్యదర్శి జిలాని, తశీగడపల్లి గ్రామ సర్పంచ్ రాములు, సుధీర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిదంగా బీ ఆర్ ఎస్ రాజేంద్ర నగర్ ఇంచార్జి కార్తీక్ రెడ్డి, పిస్తా హౌస్ అధినేత మాజీద్ ,ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి,హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి,శంకర్ పల్లి మునిసిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, అంజత్,వసియోద్దీన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



## మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్‌గా జి. శ్రీనివాస్ నియామకం

**శశిరేఖ పదవీ విరమణ నేపథ్యంలో బదిలీ ఉత్తర్వులు జారీ**

**త్వరలో బాధ్యతలు స్వీకరణ**

తెలుగుజ్యోతి,శేరిలింగంపల్లి, జూన్ 17:

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మియాపూర్ సర్కిల్ (48) కు ఉప కమిషనర్‌గా జి. శ్రీనివాస్‌ను నియమిస్తూ కమిషనర్ సృజన బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉప కమిషనర్ శశిరేఖ ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా సంబంధాల అధికారి (పి ఆర్ ఓ )గా విధులు నిర్వహిస్తున్న జి. శ్రీనివాస్ బదిలీపై మియాపూర్ సర్కిల్‌కు రానున్నారు. గతంలో ఆయన జిహెచ్ఎంసి జాయింట్ కమిషనర్‌గా, అనంతరం మిర్యాలగూడ మున్సిపాలిటీ కమిషనర్‌గా సేవలందించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటయ్యాక ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆయన, ఇప్పుడు మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. శశిరేఖ నుండి త్వరలోనే ఆయన ఛార్జ్ తీసుకోనున్నారు.

## విహెచ్ హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించిన టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి.

**టీజీఐఐసీ చైర్ పర్సన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి.**





తెలుగు జ్యోతి న్యూస్ 17 జూన్ సంగారెడ్డి ప్రతినిధి.

సంగారెడ్డి జిల్లా, బుధవారం నాడు సెక్రటేరియట్ లో రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి శాఖ సలహాదారులు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,వి హనుమంతరావు కార్యాలయంలో ఆయన కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి ఆయన సతీమణి టి జి ఐ ఐ సి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి.

## ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

**గుడిసెలు వేసుకున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**హనుమకొండ :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేకపోతే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగి ప్రభుత్వంపై తిరుగుబాటు అనివార్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ జిల్లా గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో నిర్మించిన "సురవరం సుధాకర్ రెడ్డి నగర్" సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ భూములపై గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలకు ఇప్పటికీ సొంత ఇల్లు లేదని, స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా పేదల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో అనేక ప్రాంతాల్లో భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని, పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల పోరాటాల వల్లే తెలంగాణ విముక్తి సాధ్యమైందని, ప్రజా హక్కుల పరిరక్షణలో కమ్యూనిస్టుల పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గుండ్లసింగారం కాలనీవాసులు ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని ఆదర్శంగా నిలిచారని అభినందించారు. కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో, అవసరమైతే ముఖ్యమంత్రితో కూడా మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గుడిసెవాసుల హక్కుల సాధన కోసం సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కాలనీలో విద్యుత్, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్.ఏ. స్టాలిన్, జిల్లా నాయకులు, కాలనీ ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, వందలాది మంది కాలనీవాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ శాసన సభా పతి..రైతుల మీద కేసులు పెట్టి జైలుకు పంపుతారా?

డాక్టర్ మెతుకు ఆనంద్

**వికారాబాద్ :** అమ్మ పెట్టదు అడుక్కోనివ్వదు అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు అనంద్ అన్నారు. మర్పల్లి మండలం, తుమ్మలపల్లి గ్రామంలో అభివృద్ధిని అడ్డుకుంటున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రోడ్డు పక్కన గ్రామంలో గుంతలు ప్రభుత్వం పూల్చడం లేదు, ప్రజలు శ్రమదానం

## జేపీ దర్గా ప్రత్యేక పూజలకు వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎంపీపీ యం శివశంకర్ గౌడ్





**తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 17**

షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రముఖ జేపీ దర్గా ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు విచ్చేసిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.పప్పురస్పోర్ట్ ఆవరణలో నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం. శివశంకర్ గౌడ్, కొత్తూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జే. సుదర్శన్ గౌడ్, కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, నందిగామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమారస్వామి గౌడ్, వెంకమ్మగూడ సర్పంచ్ గొల్లపల్లి అశోక్, చేగుర్ సర్పంచ్ మంకాల శ్రీశైలం, బుగ్గోనీగూడ సర్పంచ్ బుగ్గ సాలయ్య, నందిగామ మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆవులమంద శివశంకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.మహేష్ గౌడ్‌కు పూలమాలలు వేసి ఆత్మీయ స్వాగతం పలికిన నాయకులు, జేపీ దర్గా సామరస్యానికి, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి, సుభిక్షత కోసం ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతం చేశారు.

## బండోనీగూడ గ్రామంలో గుంటి మల్లన్న ఆశీస్సులతో గ్రామానికి శ్రేయస్సు కలగాలి

మాజీ ఎంపీపీ ఎం. శివశంకర్ గౌడ్

**తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 17**

నందిగామ మండల పరిధిలోని బండోనీగూడ గ్రామంలో భక్తుల ఆరాధ్య దైవమైన గుంటి మల్లన్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బండ మల్లేష్, మాజీ వార్డు సభ్యుడు బండ నరసింహ, గ్రామ పెద్దలు, భక్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొత్తూరు ఉమ్మడి మండలం మాజీ ఎంపీపీ ఎం. శివశంకర్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సాంస్కృతిక విలువలను బలోపేతం చేస్తాయని అన్నారు. గుంటి మల్లన్న ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించుకుంటూనే గ్రామాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు.విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. కార్యక్రమంలో బుగ్గోనీగూడ గ్రామ సర్పంచ్ బుగ్గ సాలయ్య, చేగూరు గ్రామ సర్పంచ్ మంకాల శ్రీశైలం, నందిగామ మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆవులమంద శివశంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుల బుచ్చయ్య, వెంకమ్మగూడ మాజీ సర్పంచ్ బుయ్యని రజినీత్ వీరేందర్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు గుండాల సాములయ్య, గుండాల వేణుగోపాల్, బండి బుచ్చయ్య, టీచర్ పాండు, బండ అశోక్, అన్నారం నరసింహ గౌడ్, బండ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జాలగూడెం రాజు, ఉపాధ్యక్షుడు యాదయ్య, జాలగూడ ఆంజనేయులు, పసుల పాండు, పర్వతాలు, నరేందర్, తార్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తుల సందడితో గుంటి మల్లన్న విగ్రహ ప్రతిష్ఠోత్సవం విజయవంతంగా ముగిసింది.





## వికారాబాద్ జిల్లా -- పరిగి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**వికారాబాద్ జిల్లా బ్యూరో**



వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తిని టిప్పర్ వాహనం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అలాగే మృతుడి గుర్తింపునకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు లేదా మృతుడిని గుర్తించగలిగిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తి వివరాలు తెలిసిన వారు వెంటనే సమాచారం అందించి బాధిత కుటుంబానికి తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు.

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రవి కుమార్ యాదవ్ చే ఆరోహి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవం



**తెలుగుజ్యోతి శేరిలింగంపల్లి :17 జూన్ :**

బుధవారం రోజు కొండాపూర్ డివిజన్ ప్రేమ్ నగర్ లో ఆరోహి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ చేతుల మీదుగా స్కూల్ ప్రారంభోత్సవం చేయడం జరిగింది.ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ చిన్నపిల్లలకు అందుబాటులో అన్ని సౌకర్యాలతో చక్కటి భవనాన్ని నిర్మించి విద్యార్థులకు తల్లిదండ్రులకు ఫీజుల భారం పడకుండా తక్కువ ఫీజులతో చక్కటి ఇంటర్నేషనల్ స్కూల్ ను ప్రారంభించడం సంతోషంగా ఉంది అన్నారు. స్కూల్ యాజమాన్యం కూడా పిల్లలకు మంచి విద్యను అందిస్తూ తక్కువ ఫీజులు వసూలు చేస్తూ మంచి పేరు ప్రతిష్టలు పొందాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ యజమాన్యం కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం డా.. దినేష్ భరత్,రేఖ,విజయలక్ష్మి, అమీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

## గోతులమయమైన విజయలక్ష్మి, తీగాపూర్--చేగూర్ రోడ్డు వరకు.



వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామస్తుల డిమాండ్

**తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 17**

కొత్తూరు మండల పరిధిలోని విజయలక్ష్మి గ్రామం నుంచి తీగాపూర్ మీదుగా చేగూర్ వరకు ఉన్న సీసీ రహదారి ప్రస్తుతం గుంతలమయంగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఒకప్పుడు సౌకర్యవంతంగా ఉన్న ఈ రహదారి ప్రస్తుతం పలుచోట్ల దెబ్బతిని ప్రమాదాలకు నిలయంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఈ రహదారిపై ప్రయాణిస్తుండగా గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు కనిపించక ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందన్నారు.ఈ రహదారి ద్వారా పలు గ్రామాలకు రాకపోకలు సాగుతుండటంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ప్రజలకు ప్రాణసంకటంగా మారిన రహదారి.. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి" అంటూ స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంటా శివారెడ్డి



**తెలుగు జ్యోతి న్యూస్ కుత్బుల్లాపూర్, జూన్ 17**

కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంటా శివారెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సేవలో విశేష కృషి చేసిన కూన శ్రీశైలం గౌడ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో చిరకాలం ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొంటూ సమాజానికి సేవలు అందించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆదరణ, ఆశీర్వాదాలతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని శివారెడ్డి ప్రార్థించారు.

## యం పి టి సి కుటుంబాన్ని పరామర్శించిన - మాజీ స్పీకర్ తమ్మినేని



**తెలుగు జ్యోతి న్యూస్ నరసన్నపేట,జలుమూరు,:**

నరసన్నపేట నియోజకవర్గశీ పరిధిలోని జలుమూరు మండలం అల్లాడ గ్రామంలో బుధవారం యం పి టి సి కుటుంబాన్ని యువ నాయకులు ధర్మాన కృష్ణ చైతన్య తో కలిసి పరామర్శించిన మాజీ స్పీకర్ శ్రీకాకుళం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం జలుమూరు మండలం అల్లాడ గ్రామ ఎంపీటీసీ మొజ్జడ అరుణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని కృష్ణ చైతన్యతో కలిసి పరామర్శించిన తమినేని సీతారాం అనంతరం బాధిత కుటుంబాన్ని మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని తమ్మినేని తెలియపరిచారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, జిల్లా కార్యదర్శి మొజ్జడ శ్యామలరావు , మండల బూత్ కమిటీ అధ్యక్షులు పైడి విఠల్ రావు , మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మూకాళ్ళ రాజారావు మండల యూత్ ఉప అధ్యక్షులు కళ్యాణం శ్రీనివాస్, ఎంపిటిసి వెలమల అసిరినాయుడు,సర్పంచ్ బుర్లె అసిరమ్మ తదితర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంత్ రెడ్డి.

**తెలుగు జ్యోతి న్యూస్ 17 జూన్ సంగారెడ్డి ప్రతినిధి.**



సంగారెడ్డి జిల్లా ,కొండాపూర్ మండలం గుంతపల్లిలో ప్రపంచ పారిశుద్ధ్య కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని, కార్మికులను సత్కరించారు గ్రామ సర్పంచ్ పడమటి అనంత్ రెడ్డి. పారిశుద్ధ్య కార్మికులకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ కార్మికుల సేవలు అమోఘం అని కొరియాడారు. ఎండ, వాన ,చలి అని లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులను గౌరవించి సత్కరించడంలో వారికి మరింత గౌరవాన్ని ఇచ్చిన వారం అవుతాం. వారు మరింత రెట్టింపు ఉత్సాహంతో సంతోషంగా పనిచేస్తారని తెలియజేశారు.

## బిజెపి మహిళా మోర్చా కార్యక్రమంలో రాజేశ్వరరావు దేశ్పాండే.

**తెలుగు జ్యోతి న్యూస్ జూన్ 17 సంగారెడ్డి ప్రతినిధి.**



సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి పట్టణంలో గాంధీ సెంటర్ హై స్కూల్లో నిర్వహించిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 12 ఏళ్ల సుపరిపాలన సందర్భంగా మహిళా మోర్చా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్, వంటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గెలిచిన విద్యార్థులకి బహుమతులు అందజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశ్ పాండే. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బిజెపి నాయకులు,విజయ్, వాసు, నాగరాజు, తులసి రెడ్డి, జోష్ణ, పాఠశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి ని దర్శించుకున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కుటుంబ సభ్యులు.

**శ్రీవారి సన్నిధిలో మొక్కులు చెల్లించు కున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్.**

**కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనం, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు.**

తెలుగు జ్యోతి న్యూస్ జూన్ 17 సంగారెడ్డి ప్రతినిధి.



సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ మంగళవారం కుటుంబ సమేతంగా తిరుమల వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నిర్వహించిన (విఐపి) విరామ దర్శనంలో పాల్గొని స్వామి వారి సేవలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా ప్రజలు మరియు రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సంగారెడ్డి నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కు వేద ఆశీర్వచనం అందించి, స్వామి వారి శేష వస్త్రాలు కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు భక్తి పూర్వకంగా స్వామివారి ఆశీస్సులు స్వీకరించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో, జి శ్రీనివాస్ గౌడ్ సీనియర్ జిల్లా నాయకులు, చింత సాయినాథ్ సంగారెడ్డి నియోజకవర్గ బి ఆర్ ఎస్ యువ నాయకులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

# ఎరువుల ధరలు పెరుగుదలపై రైతుల తీవ్ర ఆందోళన.

**ధరలు తగ్గించి రైతులకు ఉపశమనం కల్పించాలని డిమాండ్.**

**కొండాపూర్ మండల బి ఆర్ ఎస్ యువ నాయకులు గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంత్ రెడ్డి.**

తెలుగు జ్యోతి న్యూస్ 17 జూన్ సంగారెడ్డి ప్రతినిధి.



సంగారెడ్డి జిల్లా, రాష్ట్రంలో ఎరువుల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు, బి ఏ పి,యూరియా వంటి ప్రధాన ఎరువుల ధరలు గణనీయంగా పెరగడంతో, సాగు వ్యయాలు అధికమై రైతులపై అదనపు ఆర్థిక భాగం పడుతుందన్నారు. ఎరువుల సరఫరా లో ఎరువుల రవాణా ఖర్చులు పెరుగుదల మధ్యవర్తుల దోపిడీ ప్రభుత్వాల నిర్లక్ష్యం వంటి కారణాలతో రైతులు నష్టపోతారని బి.ఆర్.ఎస్ యువ నాయకులు పడమటి అనంతరెడ్డి ఆరోపించారు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా జీవిస్తున్న రైతులకు ఎరువుల ధరలు పెరుగుదల తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మేము పండిస్తే దేశం బతుకుతుంది మాకు న్యాయం ఎప్పుడూ అని రైతులు ప్రశ్నిస్తున్నారని వారు అన్నారు. రైతుల కష్టాలను గుర్తించి ఎరువుల తలను తక్షణమే తగ్గించాలని, అవసరమైన చోట ఎరువులను సరిపడ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాలను పడమటి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు సాగుభారం తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు. రైతులను దృష్టిలో ఉంచుకొని ఎరువుల ధరల నియంత్రణ, పాటించే వ్యవస్థకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని బి.ఆర్.ఎస్ యువ నాయకులు పడమటి అనంతరెడ్డి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుబంధు, రైతు బీమా ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నాణ్యమైన విద్యుత్ ఇవ్వకుండా, విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రజా ప్రభుత్వం, రైతు ప్రభుత్వం, పేదల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు రైతులను ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన, 6 గ్యారంటీలు 420 హామీలు నెరవేర్చాలని పడమటి అనంత్ రెడ్డి గుంతపల్లి సర్పంచ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గౌతమ్ వరల్డ్ స్కూల్ 68వ బ్రాంచ్ ప్రారంభించిన బిజెపి రాష్ట్ర ఉప అధ్యక్షురాలు కొల్లి మాధవి, పాఠశాలల చైర్మన్ ఎం వెంకటనారాయణ







**పిల్లలకు మంచి విద్యను అందిస్తే పాఠశాలకు మంచి గుర్తింపు గౌరవం వస్తుంది**

నిజాంపేట్ తెలుగు జ్యోతి ప్రతినిధి జూన్ 17


నిజాంపేట సర్కిల్ బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్ పూజిత ఎన్క్లేవ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ్ వరల్డ్ పాఠశాలను ప్రారంభించిన బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, గౌతమ్ మోడల్ స్కూల్ చైర్మన్ ఎం వెంకటనారాయణ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతమ్ మోడల్ స్కూల్ ఎంతో పేరు ప్రతిష్ట గల పాఠశాలని విద్యార్థిని విద్యార్థులకు విద్య ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంత ముఖ్యమన్నారు పాఠశాలలో విశాలమైన గదులు, చుట్టూ చల్లటి గాలి, మంచి ప్లేగ్రౌండ్ ఉందని అందులో క్రికెట్ స్టేడియం, బాస్కెట్బాల్ స్టేడియం, ఫుట్బాల్ స్టేడియం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. రోజుకు రెండు గంటల పాటు విద్యార్థినీ విద్యార్థులకు ఆటపాటలలో శిక్షణ ఇస్తే వారి మేధాశక్తి కూడా పెరుగుతుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గౌతం వరల్డ్ స్కూల్ 68వ బ్రాంచిని బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్ లో ఏర్పాటు చేశామని పాఠశాలలో నర్సరీ నుండి ఎనిమిదవ తరగతి వరకు విద్యాబోధన మంచి ఉన్నతమైన చదువులు చదివిన అధ్యాపకులచే విద్యను బోధిస్తామని , పిల్లలకు కంప్యూటర్ శిక్షణ ల్యాబ్ ఉందని పిల్లలకు విద్యతోపాటు మంచి నైపుణ్యమైన క్రీడా మాస్టర్ లతో క్రీడా శిక్షణ కూడా ఉంటుందన్నారు. గౌతమ్ మోడల్ స్కూల్ నుంచి పీజీ టీఎల్ క్రికెట్కు 19 మంది సెలెక్ట్ అయ్యారని రాబోకాలంలో మన గౌతం పాఠశాల నుండి మరింత మందిని ఆట పోటీలలో తీర్చిదిద్ది నేషనల్, ఇంటర్నేషనల్ కు వెళ్లే విధంగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గౌతం పాఠశాలల డైరెక్టర్ శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్, పూజిత ఎన్క్లేవ్ ఫౌండర్ ప్రసాదరావు, పూజిత ప్రెసిడెంట్ శరత్ చౌదరి గంటా, పూజిత పిఆర్ఓ విద్యాసాగర్ అనంతుల, బిజెపి తెలంగాణ బాచుపల్లి అధ్యక్షులు ప్రసాద్ రాజు, వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ కిరణ్, తదితర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు లు పాల్గొన్నారు.

# శంషాబాద్ -- కొత్తూరు ఎన్‌హెచ్--44 రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

**స్థానిక గ్రామస్తుల ఆవేదన**

తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 17

శంషాబాద్ నుండి కొత్తూరు వరకు జాతీయ రహదారి (ఎన్‌హెచ్--44) విస్తరణ, మరమ్మతు పనులు మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యలు, దుమ్ము, ప్రమాదాల భయం వెంటాడుతున్నాయని తెలిపారు.
ముఖ్యంగా కొత్తూరు, నందిగామ పరిసర ప్రాంతాల ప్రజలు ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్యా సంస్థలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా మారి వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రజల రాకపోకలకు అత్యంత కీలకమైన ఈ జాతీయ రహదారిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్--44 పనులు నిలిచిపోవడంతో ప్రజలకు నిత్యం కష్టాలు -- వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తుల డిమాండ్" అంటూ స్థానికులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.






## కాంగ్రెస్ ప్రభుత్వానికి పెన్షన్ కాదు.. పేదలకు టెన్షన్" బీఆర్ఎస్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి

**పెన్షన్ హామీలు ఏమయ్యాయి..? 20 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లోనే" -- బీఆర్ఎస్ ఆగ్రహం**

**కాంగ్రెస్‌కు పెన్షన్.. పేదలకు టెన్షన్" -- అర్హులందరికీ వెంటనే పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్**

**హామీలు ఇచ్చి మరిచారా..? పెండింగ్ పెన్షన్లపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్**

తెలుగు జ్యోతి న్యూస్ జీడిమెట్ల, జూన్ 17



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాలాకాలం గడిచినా పేదలకు కొత్త పెన్షన్లు మంజూరు చేయడంలో పూర్తిగా విఫలమైందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల 132వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కొత్త, పాత దరఖాస్తులు కలిపి దాదాపు 20 లక్షల పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, అర్హులైన లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పెన్షన్, వృద్ధులు మరియు వితంతువులకు రూ.4 వేల పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా పాత పెన్షన్లనే కొనసాగిస్తోందని విమర్శించారు. బడ్జెట్‌లో కేవలం 2 లక్షల కొత్త పెన్షన్లకు మాత్రమే అవకాశం కల్పించడం ద్వారా మిగిలిన లక్షలాది మంది అర్హులను నిరాశపరిచిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు హయాంలో అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్లు ఇంటి వద్దకే అందేవని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో మాత్రం పేదలకు ఇబ్బందులు పెరిగాయని ఆయన వ్యాఖ్యానించారు. జీడిమెట్ల 132వ డివిజన్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రతి అర్హుడికి తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలని, ఎన్నికల హామీ మేరకు పెంచిన పెన్షన్ మొత్తాలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున వీరారెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. పేదల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## రైతులకు విత్తనాలపై అవగాహన

**గ్రామ వ్యవసాయ సహాయకుడు**

**ఎన్. భగవత్ కుమార్**

తెలుగు జ్యోతి న్యూస్ ఆమదాలవలస నియోజకవర్గం:



చీమలవలస రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు అందించిన 9 రకాల విత్తనాలను మొలక శాతాన్ని పరీక్షించడం జరిగింది. 95 శాతం మొలక రావడం జరిగింది అని రైతులు కు తెలియజేయడం జరిగింది. వ్యవసాయ సహాయకుడు ఎన్. భగవత్ కుమార్ మాట్లాడుతూ రైతులు ఎక్కడ విత్తనాలు కొనుకున్న అనగా ప్రైవేట్ షాప్స్ లో కొనుకున్న , సొంతంగా తయారుచేసుకొని దాచుకున్న మరియు ఇతరత్రా డీలర్స్ రైతులు దగ్గర కొనుకున్న విత్తనాలను విత్తేముందు ఒకసారి విత్తన మొలకను పరీక్షించి విత్తుకోవాలని తెలియజేశారు.

## బండోనీగూడలో గుంటి మల్లన్న విగ్రహావిష్కరణ చేసిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి





తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 17

నందిగామ మండల పరిధిలోని బండోనీగూడ గ్రామంలో భక్తుల ఆరాధ్య దైవమైన గుంటి మల్లన్న విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక పరిరక్షణకు తన వంతు సహకారంగా గుంటి మల్లన్న విగ్రహం ఏర్పాటుకు రూ. 3.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావానికి ఈ విగ్రహం ప్రతీకగానిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పూజారులు శివానందం, కర్ణాకర్ చేగుర్ సింగిల్ విండో డైరెక్టర్ జాలగూడెం అనిత సాములయ్య, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బండ మల్లేష్, మాజీ వార్డు నెంబర్ బండ నరసింహ, నర్సప్ప గూడ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగిల్ కుమార్, బండ శ్రీశైలం, బండ కుమార్, జెట్ట మహేందర్, చేగుర్ పబ్బే నరేందర్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విగ్రహావిష్కరణను విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ హామీలు నీరుగారాయి.. ప్రజల్లో తీవ్ర నిరాశ: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,

తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 17

షాద్‌నగర్ పట్టణంలోని కుంట్ల రాంరెడ్డి గార్డెన్‌లో బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటరు సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) అవగాహన శిబిరం ఘనంగా నిర్వహించారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పాలమూరు ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఓటరు సమగ్ర సర్వేపై మాట్లాడుతూ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల ఓట్లు జాబితాలో సక్రమంగా ఉండేలా బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు బీఆర్ఎస్ ఒత్తిడితోనే వేగం పుంజుకున్నాయని సబితా పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు మరవలేరని అన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో విశేష పురోగతి సాధించామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్‌కు ప్రజలు అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కీలక ప్రాజెక్టులను తీసుకొచ్చిందన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఆలోచన కేసీఆర్‌దేనని, ఆ ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెస్ నాయకుల వైఖరే కారణమని ఆరోపించారు. పార్టీ ఇన్‌చార్జి బైకాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని






గ్రామస్థాయి వరకు విస్తరించి ఉద్యమంలా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఓటరు సమగ్ర సర్వేలో ప్రతి బూత్ స్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, వై. రవీందర్ యాదవ్, రాజా వరప్రసాద్, నరేందర్, ఎంఎస్ నటరాజ్, కడంపల్లి శ్రీనివాస్ గౌడ్, రాంబల్ నాయక్, లక్ష్మీనరసింహారెడ్డి, మిట్టు నాయక్, ఈట గణేష్, మాదారం నరసింహా గౌడ్, సోమ్లా నాయక్, లక్ష్మణ్ నాయక్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ఎస్సై బాలరాజ్ ఆధ్వర్యంలో




తెలుగు జ్యోతి న్యూస్ ఆమదాలవలస నియోజకవర్గం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చే పట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భా గంగా బుధవారం నాడు పార్వతీశంపేట జంక్షన్ లో ఆమదాలవలస పోలీస్ స్టేషన్ ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత అ వగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత,మహిళలు, విద్యార్థులు మరియు గ్రామస్తులకు మాదకద్రవ్యాల విని యోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,ఆరోగ్యంపై మరియు భవిష్యత్తుపై పడే ప్రభావాలను వివరించారు. ఆమదాలవలస ఎస్సై టూ కాంతారావు మాట్లాడుతూ,మాదకద్రవ్యాల బారిన పడకుం డా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మ త్తు పదార్థాలు వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా కు టుంబాలు,సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని పే ర్కొన్నారు. యువత తమ లక్ష్యాలను సాధించేందుకు క్రమశి క్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆయ న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు యువత పాల్గొన్నారు

## రూ.1.88 కోట్లతో మియాపూర్‌లో బీటీ, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన




తెలుగుజ్యోతి మియాపూర్:17 జూన్ :

మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రజయ్ షెల్టర్, జనప్రియ వెస్ట్ సిటీ, నాగార్జున ఎనక్లేవ్ కాలనీలలో రూ.1 కోటి 88 లక్షల అంచనాతో చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గౌరవ్రాజా చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శ్రీ ఉప్పలపాటి శ్రీకాంత్, శ్రీ నార్నె శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ గారు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. కాలనీల్లో రహదారుల అభివృద్ధి వల్ల ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీ శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ట్రాఫిక్ రహిత, సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**శంకుస్థాపన చేసిన పనుల వివరాలు:**
ప్రజయ్ షెల్టర్ నుంచి మక్త మహబూబ్ పెద్దకుడి చెరువు కల్వర్టు వరకు రూ.68 లక్షలతో సీసీ రోడ్డు జనప్రియ వెస్ట్ సిటీలో రూ.54 లక్షలతో సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాల్ ఫ్లోరింగ్ బొల్లారం మెయిన్ రోడ్డునుంచి నాగార్జున ఎనక్లేవ్ వరకు రూ.66 లక్షలతో బీటీ కనెక్టివిటీ రోడ్డు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ అట్రియల్ ఫైబ్రిలేషన్ కోసం ఇంటిగ్రేటెడ్ 3డి మ్యాపింగ్‌తో పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ విధానాలను భారతదేశంలో మొదటిసారిగా విజయవంతం

శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ అట్రియల్ ఫైబ్రిలేషన్ కోసం ఇంటిగ్రేటెడ్ 3డి మ్యాపింగ్‌తో పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ విధానాలను భారతదేశంలో మొదటిసారిగా విజయవంతంగా నిర్వహించి మైలురాయిని సాధించింది
తెలుగు జ్యోతి హైదరాబాద్, జూన్ 17బి 2026: శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్, హైదరాబాద్, కార్డియాక్ కేర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. డా. వి. ఎస్. రామచంద్ర మరియు అతని బృందం అట్రియల్ ఫైబ్రిలేషన్ (AF) ఉన్న రోగులకు అధునాతన 3డి జూూాూ మ్యాపింగ్ మరియు ఇంట్రాకార్డియాక్ ఎకోకార్డియోగ్రఫీ మార్గదర్శకత్వంతో నాలుగు పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ (PFA) విధానాలను విజయవంతంగా నిర్వహించారు. నలుగురు రోగులు బాగా కోలుకుని అదే రోజు డిశ్చార్జ్ అయ్యారు. దేశంలో ఇంటిగ్రేటెడ్ 3డి మ్యాపింగ్ సిస్టమ్ మరియు పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ (PFA)ను కలిపి ఉపయోగించడం ఇదే మొదటిసారి.
ఈ విధానాలు ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేసే అత్యంత సాధారణ దీర్ఘకాలిక హృదయ లయ రుగ్మత అయిన అట్రియల్ ఫైబ్రిలేషన్ చికిత్సలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచాయి. అధునాతన ఇమేజింగ్ మరియు మ్యాపింగ్ టెక్నాలజీలతో కలిపి పల్స్ ఫీల్డ్ అబ్లేషన్‌ను విజయవంతంగా ఉపయోగించడం వల్ల సంక్లిష్ట కార్డియాక్ లయ రుగ్మతలకు సురక్షితమైన, వేగవంతమైన మరియు మరింత ఖచ్చితమైన చికిత్సకు అవకాశం ఉందని నిరూపించబడింది.
అట్రియల్ ఫైబ్రిలేషన్ అనేది గుండె అసమానంగా మరియు తరచుగా వేగంగా కొట్టుకునే పరిస్థితి, ఇది స్ట్రోక్, గుండె వైఫల్యం మరియు ఇతర హృదయ సంబంధ సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. ఫలితాలను మెరుగుపరచడానికి మరియు రోగుల జీవన నాణ్యతను పెంచడానికి ముందస్తు నిర్ధారణ మరియు చికిత్స అవసరం. సాంప్రదాయకంగా, కాథెటర్ అబ్లేషన్ విధానాలు వేడి లేదా చలి శక్తిని ఉపయోగించి పరిస్థితిని ప్రేరేపించే అసాధారణ విద్యుత్ మార్గాలను వేరు చేస్తాయి. వ్యాధి ప్రారంభ దశలో చేసినప్పుడు, అబ్లేషన్ అత్యంత ప్రభావవంతమైన మరియు శాశ్వత ఫలితాలను ఇస్తుంది. పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ ఈ రంగంలో విప్లవాత్మక పురోగతిని సూచిస్తుంది. వేడి లేదా చలికి బదులుగా, ఈ విధానం మైక్రోసెకండ్ విద్యుత్ ప్రేరణలను జాగ్రత్తగా నియంత్రించి చుట్టుపక్కల నిర్మాణాలకు నష్టం కలిగించే ప్రమాదాన్ని తగ్గిస్తూ అసాధారణ గుండె కణజాలాన్ని ఎంపిక చేసి లక్ష్యంగా చేసుకుంటుంది. ఈ విధానం



సురక్షితమైనది, వేగవంతమైనది మరియు మరింత సమర్థవంతమైనది. వైద్య బృందం ప్రకారం, అట్రియల్ ఫైబ్రిలేషన్ కోసం విజయవంతమైన ౹ాఖీూాకు ఖచ్చితమైన శక్తి పంపిణీ మరియు చికిత్స ప్రభావం యొక్క తక్షణ నిర్ధారణను నిర్ధారించడానికి ఏకాలంలో త్రిమితీయ ఎలక్ట్రో-అనాటమికల్ మ్యాపింగ్ అవసరం. ఈ విధానాల సమయంలో, గుండె యొక్క అనాటమీ మరియు విద్యుత్ కార్యకలాపాల యొక్క వివరణాత్మక దృశ్యీకరణ కోసం అధునాతన 3డి జూూాూ మ్యాపింగ్ టెక్నాలజీ మరియు ఇంట్రాకార్డియాక్ ఎకోకార్డియోగ్రఫీ ఉపయోగించబడ్డాయి. మరో ముఖ్యమైన విజయంలో, బృందం ప్రతి రోగి గుండె యొక్క సమగ్ర అల్ట్రాసౌండ్-ఆధారిత చిత్రాన్ని రూపొందించడానికి జూూాూ సౌండ్ టెక్నాలజీని ఉపయోగించింది. ఈ అధునాతన ఇమేజింగ్ విధానం వల్ల విధానాలను ఎక్కువ ఖచ్చితత్వంతో, మెరుగైన భద్రతతో, తక్కువ విధాన సమయాలతో మరియు దాదాపు ఞ-రే రేడియేషన్ లేకుండా నిర్వహించడం సాధ్యమైంది.

ఈ కేసుల విజయవంతమైన పూర్తి గుండె లయ రుగ్మతల చికిత్సను మార్చడంలో అధునాతన ఇమేజింగ్, మ్యాపింగ్ మరియు కాథెటర్-ఆధారిత సాంకేతికతల పెరుగుతున్న పాత్రను హైలైట్ చేస్తుంది. పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ వంటి ఆవిష్కరణలు రోగి ఫలితాలను మెరుగుపరచడంలో మరియు అట్రియల్ ఫైబ్రిలేషన్‌తో జీవిస్తున్న వ్యక్తులకు సురక్షితమైన చికిత్స ఎంపికలకు ప్రాప్యతను విస్తరించడంలో సహాయపడతాయని నిపుణులు విశ్వసిస్తున్నారు. ఈ సాధన గురించి మాట్లాడుతూ, హైదరాబాద్ నిజాంపేటలోని సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ ఞ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ డా. వి. ఎస్. రామచంద్ర మాట్లాడుతూ, "పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ అట్రియల్ ఫైబ్రిలేషన్‌ను మనం చికిత్స చేసే విధానాన్ని మారుస్తోంది. అధునాతన మ్యాపింగ్ టెక్నాలజీలు, ఇంట్రాకార్డియాక్ ఇమేజింగ్ మరియు ఖచ్చితమైన శక్తి పంపిణీని కలపడం ద్వారా, మేము రోగులకు వేగంగా కోలుకోవడం మరియు అద్భుతమైన ఫలితాలతో సురక్షితమైన విధానాన్ని అందించగలము. ఈ కేసుల విజయవంతమైన పూర్తి మా రోగులకు కార్డియాక్ కేర్‌లో తాజా పురోగతులను తీసుకురావడానికి మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ దేశంలో ౹ాఖీూా టెక్నాలజీని ప్రవేశపెట్టిన మొదటి ఆసుపత్రి. ఈ సాధన భారతదేశంలో ఎలక్ట్రోఫిజియాలజీ మరియు కార్డియాక్ రిథమ్ మేనేజ్‌మెంట్ పరిణామంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుంది మరియు అత్యాధునిక వైద్య సాంకేతికత మరియు క్లినికల్ నైపుణ్యం ద్వారా అధునాతన, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణను అందించడానికి శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ యొక్క నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుంది. శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్‌లోని అట్రియల్ ఫైబ్రిలేషన్ అబ్లేషన్ సెంటర్ హీగ్గాజు విధానం మరియు ౹ాూాా క్లిప్పింగ్ టెక్నిక్‌లు వంటి కనీస శస్త్రచికిత్స విధానాలను కూడా సమగ్రపరుస్తుంది.

**శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ గురించి**
శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ హైదరాబాద్‌లోని ప్రముఖ బహుళ-ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సంస్థ. అధునాతన సాంకేతికత, అనుభవజ్ఞులైన నిపుణులు మరియు సాక్ష్యం-ఆధారిత చికిత్సా ప్రోటోకాల్‌ల ద్వారా సమగ్ర, రోగి-కేంద్రీకృత వైద్య సంరక్షణను అందించడానికి కట్టుబడి ఉంది. ఆసుపత్రి కార్డియాలజీ, కార్డియాక్ సైన్సెస్, ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఆర్థోపెడిక్స్, ఆయుర్వేదం, యోగా మరియు ఇతర క్లినికల్ విభాగాలలో ఆవిష్కరణ, భద్రత మరియు సంపూర్ణ వైద్యంపై దృష్టితో విస్తృత శ్రేణి ప్రత్యేక సేవలను అందిస్తుంది.

## గుంటి మల్లన్న ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

**బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్**
తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 17



నందిగామ మండలంలోని బండోనీగూడ గ్రామంలో భక్తుల ఆరాధ్య దైవం గుంటి మల్లన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ ప్రజల భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా గుంటి మల్లన్న విగ్రహం నిలుస్తుందన్నారు. భక్తి, సంప్రదాయాలు, గ్రామ ఐక్యతను మరింత బలోపేతం చేసే కార్యక్రమంగా ఈ విగ్రహ ప్రతిష్ఠాపన నిలిచిందని పేర్కొన్నారు. వేదమంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు జిల్లెల వెంకట్ రెడ్డి, పూజారులు శివానందం, కర్ణాకర్, గ్రామ సర్పంచ్ జెట్ట కుమార్ కుర్మా, బుగ్గోనీగూడ మాజీ సర్పంచ్ బండి నీలమ్మ రాజు, సింగిల్ విండో డైరెక్టర్ బండి మల్లేష్, జాలగూడెం అనిత సాములయ్య, బండ నరసింహ, జంగిల్ కుమార్, బండ శ్రీశైలం, బండ కుమార్, వీర్లపల్లి శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో భక్తి పారవశ్యాన్ని నింపిన ఈ గుంటి మల్లన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహంతో విజయవంతంగా ముగిసింది.

# మియాపూర్‌లో ఘనంగా సమ్మక్క సారలమ్మ పూజా మహోత్సవం.. ప్రముఖుల పాల్గొనం

తెలుగుజ్యోతి మియాపూర్ :17 జూన్ :

మియాపూర్‌లో భక్తి శ్రద్ధల నడుమ శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల పూజా మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాచమల్ల కృష్ణ పటేల్ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరియు తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, యువ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్ పాల్గొని అమ్మవార్ల దివ్య ఆశీర్వాదాలు పొందారు. పూజా కార్యక్రమంలో భాగంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించగా భక్తులు భారీగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. స్థానికంగా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమని, సమాజంలో ఐక్యత, సాంప్రదాయ విలువలు పెంపొందుతాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల ఓం ప్రకాష్ గౌడ్, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల సంజీవ రెడ్డి, బండారు రామచందర్, బాలింగ్




యాదగిరి గౌడ్, వీరేందర్ గౌడ్, కరుణాకర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, భాస్కర్ గౌడ్, ముద్దంగుల తిరుపతి, తాండ్ర రాంచందర్ గౌడ్, మహేందర్ ముదిరాజ్, రవికుమార్ గౌడ్, వాసు, దినేష్ గౌడ్, గిరి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో మహిళలు, యువకులు, కాలనీ వాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తెలుగు జ్యోతి
అనుక్షణం జనం కోసం జాతీయ దినపత్రిక



# లంకా దహనం సీత చేస్తే..

అలియాభట్, శార్వరి వాఘ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫిమేల్ ఓరియెంటెడ్ స్పైథ్రిల్లర్ 'ఆల్ఫా' సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. యశ్‌రాజ్ ఫిల్మ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా రానుంది. ఇందులో అలియాభట్ గూఢచారి పాత్రలో కనిపించనుంది. దేశానికి వ్యతిరేకంగా 'ఆల్ఫా' పేరుతో ప్రతినాయకుడు నడిపే మిషన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా అలియాభట్ బృందం చేసిన సాహసాలు ఏమిటన్నదే ఈ సినిమా ఇతివృత్తం. హై ఇంటెన్సిటీ యాక్షన్‌తో ట్రైలర్ ఆద్యంతం థ్రిల్‌ని పంచింది. బాబీడియోల్ క్రూరుడైన విలన్ పాత్రలో కనిపించాడు. 'సీత లంకాదహనం చేస్తే ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నారా' అంటూ అలియాభట్ చెప్పిన డైలాగ్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఆదిత్యచోప్రా నిర్మాణంలో శివ్ రవాలీ దర్శకత్వం వహించిన ఈ సినిమా జూలై 3న ప్రేక్షకుల ముందుకురానుంది.




# మరో మార్క్ దాటేసిన 'పెద్ది'

రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా మరో ఘనత సాధించింది. ఇప్పటికే ప్రేక్షకుల్ని అలరించిన ఈ చిత్రం.. ఇప్పుడు కలెక్షన్లలో రూ.400 కోట్ల మార్క్ ని అందుకుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. పోస్టర్‌ని సోషల్ మీడియాలోనూ పంచుకున్నారు. విలేజీ స్పోర్ట్స్ డ్రామాగా తీసిన 'పెద్ది' సినిమాలో రామ్ చరణ్.. క్రికెటర్, రెజ్లర్, పారా రన్నర్‌గా కనిపించాడు. విడుదలకు ముందు చాలానే హైప్ ఏర్పడింది గానీ టాక్ మాత్రం తేడా కొట్టేసింది. సినిమా చూసిన చాలామంది రామ్ చరణ్ యాక్టింగ్ బాగుందని మెచ్చుకున్నారు కానీ కథ పరంగా లోటుపాట్లు ఎత్తిచూపారు. మరీ ముఖ్యంగా జాన్వీ కపూర్ చేసిన అచ్చియమ్మ పాత్రని చూపించిన విధానంపై విపరీతమైన విమర్శలు వచ్చాయి. దీంతో అనుకున్నంత వసూళ్లు రాలేదనేది వాస్తవం. జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన సీన్స్ తీసేశారు. దర్శకుడు బుచ్చిబాబు కూడా సారీ చెప్పాడు. ఇలా ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూ వచ్చిన 'పెద్ది' సినిమా ఎట్టకేలకు రూ.400 కోట్ల కలెక్షన్ల మార్క్‌ని అయితే దాటేసింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన తెలుగు చిత్రంగా ఇది ఘనత సాధించింది. మరి రూ.500 కోట్లు వస్తాయా అంటే సందేహమే. ఎందుకంటే థియేటర్లలో ఈ చిత్రం హవా దాదాపుగా తగ్గిపోయింది. మరో రెండు వారాలు ఆగితే ఓటీటీలోకి కూడా వచ్చేస్తుంది. అదే టైంలో స్కూల్స్ కూడా తెరిచేశారు కాబట్టి ఫ్యామిలీ ఆడియెన్స్ థియేటర్లకు వచ్చే అవకాశం పెద్దగా లేదని చెప్పొచ్చు.

# 'మైసా'లో నక్సలైట్‌గా?

అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాల్లో రష్మిక ఫెరోషియస్ లుక్స్‌తో సర్‌ప్రైజ్ చేసింది. ఈ సినిమాలో ఆమె గోండు తెగకు చెందిన గిరిజన మహిళ పాత్రను పోషిస్తున్నది. కెరీర్‌లో తొలిసారి ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌చేస్తుండటంతో ఈ సినిమా విషయంలో రష్మిక మందన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ఆమె నక్సలైట్ పాత్రలో కనిపించనుందని తెలిసింది. వ్యవస్థపై ధిక్కార స్వరం వినిపించే ధీరోదాత్తురాలైన గిరిజన మహిళగా ఆమె పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. అయితే ఆమె పాత్ర తాలూకు అసలైన వివరాలు తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. పాన్ ఇండియా రిలీజ్ కానుంది.






# సేవ్ ది టైగర్స్' సీజన్ 3 ప్రీమియర్ సక్సెస్

సోమవారం సాయంత్రం హైదరాబాద్ ఏఎమ్‌బీ సినిమాస్‌లో 'సేవ్ ది టైగర్స్ సీజన్ 3' గ్రాండ్ ప్రీమియర్ వేశారు. దీనికి అద్భుతమైన స్పందన లభించింది. పలువురు సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరు కాగా వారితో పాటు అతిథులు, నటీనటులు, సాంకేతిక బృందం.. ఇలా అందరూ కలిసి సీజన్3ని ఎంజాయ్ చేశారు. సేవ్ ది టైగర్స్ 3 స్పెషల్ సెలబ్రిటీ ప్రీమియర్ వేడుకలో హీరో సందీప్ కిషన్, కామాక్షి భాస్కర్ల, రాగ్ మయూర్, బిగ్ బాస్ తెలుగు 5 విజేత వీజే సన్నీ, కళ్యాణ్ పడాలా (బిగ్ బాస్ సీజన్ 9 విజేత), చైతన్య రావు, వెంకటేష్ కాకుమాను, కార్తిక్ రత్నం, ఆదిత్య మండల, శ్రీనాథ్ మాగంటి, జబర్దస్త్ కమెడియన్ ముక్కు అవినాష్, నిరుపమ్, కిరీటి దామరాజు, మానస్ తదితరుల పాల్గొన్నారు. సేవ్ ది టైగర్స్ సీజన్ 3.. ఈ శుక్రవారం నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది.

Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223